సాక్షి
పల్నాడు
ఆదివారం । 31 । ఆగస్టు । 2025



సివిల్ రైట్స్ డే

వినుకొండ: మండలంలోని విఠంరాజుపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో శనివారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. తహసీల్దార్ సురేష్‌నాయక్ మాట్లాడారు.



గణపతికి కుంకుమ పూజ

తెనాలి: స్థానిక నందులపేటలో గణనాథునికి శనివారం భారీ సంఖ్యలో మహిళలు కుంకుమ పూజ నిర్వహించారు. దాదాపు రెండు వేల మంది పూజల్లో పాల్గొన్నారు.



పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి శనివారం 4,513 క్యూసెక్కులు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద ప్రస్తుతం 12 అడుగులు నీటి మట్టం ఉంది.

సరిహద్దులు దాటుతున్న యూరియా మాఫియా

- తెలంగాణలో బ్లాక్ మార్కెట్‌కు తరలించి అధిక ధరలకు విక్రయాలు
- దాచేపల్లి వద్ద తెలంగాణకు వెళ్తున్న 165 బస్తాల యూరియా స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు
- పల్నాడులో సాగు పూర్తి స్థాయిలో ప్రారంభం కాక ముందే ఖాళీ అవుతున్న నిల్వలు
- తనిఖీలు చేస్తున్నామంటూ చేతులు దులుపుకుంటున్న వ్యవసాయ శాఖ అధికారులు

జిల్లాలో కొరత సృష్టించి ఎరువును దారి మళ్లిస్తున్న వ్యాపారులు



దాచేపల్లి మండలం పొందుగల వద్ద విజిలెన్స్ అధికారులు పట్టుకున్న యూరియా, అక్రమ రవాణా చేస్తున్న వాహనాలు

సాక్షి, నరసరావుపేట : ఖరీఫ్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులు ఒక్కో యూరియా బస్తా రూ.450 నుంచి రూ.500లకు కొనుగోలు చేస్తున్నారు. మార్క్‌ఫెడ్, సొసైటీలలో రాయితీతో సుమారు రూ.265లకు బస్తా దొరకాలి. అయితే రైతులు దాదాపు రెట్టింపు ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఇదేం అన్యాయమని వ్యవసాయ శాఖను అడిగితే.. అబ్బే అదేం లేదు జిల్లాలో యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. కొరత లేదు కాబట్టి అసలు ధరకే ఎరువులు దొరుకుతున్నాయంటూ బుకాయిస్తున్నారు. అసలు యూరియా కృత్రిమ కొరతకు కారణాలను గుర్తించే పని ప్రభుత్వం, వ్యవసాయశాఖ అధికారులు చేయడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. మరోవైపు అధికారుల అండతోనే యూరియా మాఫియా మోసం చేస్తోందని అన్నదాతలు వాపోతున్నారు.

సాగు స్వల్పం... అమ్మకాలు అధికం



పల్నాడు జిల్లాలో ఆగస్టు మాసం పూర్తి అవుతున్నా ఖరీఫ్ సాగు కనీసం 50 శాతం కూడా పూర్తికాలేదు. ఇప్పుడిప్పుడే వరి, మిర్చి సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. అయితే జిల్లాలో యూరియా అమ్మకాలు మాత్రం అధికంగా సాగుతున్నాయి. ఇది ఎలా సాధ్యమంటే.. మాఫియా సభ్యులు స్థానిక రైతుల పేర్లతో యూరియా కొనుగోలు చేసినట్టు చూపి ఆ బస్తాలను సరిహద్దులు దాటిస్తున్నారు. ఖరీఫ్ అవసరాలకు జిల్లాకు సుమారు 3.17 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని వ్యవసాయశాఖ అధికారులు లెక్కకట్టారు. ఇందులో యూరియా 1.42 లక్షల మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 1.32 లక్షల మెట్రిక్ టన్నులు, డీఏపీ 62 వేల మెట్రిక్ టన్నులు అవసరం కానుంది. ఇందులో ఆగస్టు నెల కోటా కింద జిల్లాకు 19 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని కేటాయించగా అందులో ఇప్పటికే 17 వేల మెట్రిక్ టన్నులు అమ్మకాలు పూర్తి అయ్యాయని వ్యవసాయశాఖ లెక్కలు చెబుతున్నాయి. అయితే సాగు తక్కువగా ఉన్న సమయంలో అంత యూరియా ఎలా విక్రయించారో వ్యాపారులను నుంచి ఆరా తీస్తే అసలు విషయం బయటపడేది. కానీ వ్యవసాయశాఖ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో ఎరువుల మాఫియా రైతులను కొల్లగొడుతున్నారు. ముఖ్యంగా కారంపూడి, వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్ల వంటి ప్రాంతాల నుంచి యూరియా పక్కదారి పడుతోంది.

కొరత సృష్టిస్తున్న అక్రమదారులు

ఎరువులను సంతృప్తికర స్థాయిలో అందుబాటులో ఉంచడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. ఉన్న అరకొర నిల్వలను మాఫియాగా మారిన కొందరు అక్రమదారులు ఇతర ప్రాంతాలకు తరలించి మరింత కొరతను సృష్టిస్తున్నారు. ఒకవైపు సరిహద్దు తెలంగాణ జిల్లాలకు ఇక్కడి యూరియాను తరలించి బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మరోవైపు ఇక్కడి నిల్వలు తరలిపోవడంతో రైతులకు అవసరానికి తగ్గట్టు లేకపోవడంతో డిమాండ్ పెరిగి ధరలు రెట్టింపు అవుతున్నాయి. గత నెల రోజులుగా పల్నాడు జిల్లా నుంచి వేల టన్నుల యూరియా పక్కదారి పట్టింది. పక్క రాష్ట్రంలోని పారిశ్రామిక అవసరాలకు సైతం మన యూరియానే సరఫరా అవుతుండటం మరింత ఇబ్బందికరంగా మారుతోంది. యూరియా అక్రమ రవాణాను అడ్డుకోవడంలో ప్రభుత్వం, అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. గురువారం దాచేపల్లి మండలం పొందుగల వద్ద దొరికిన ఒకటి రెండు సంఘటనలు తప్ప పెద్దగా కట్టడి చేసిన దాఖలాల కనిపించడంలేదు. పొందుగల వద్ద రెండు వాహనాలలో తరలిస్తున్న 165 బస్తాలలోని 7,425 కిలోల యూరియాను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. ఇలాంటి వాహనాలు నిత్యం తెలంగాణ వైపు గత నెల రోజులుగా వెళ్తున్నట్టు తెలుస్తోంది.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

- డీలర్లు, వ్యాపారులకు కలెక్టర్ హెచ్చరిక
- ఎస్పీతో కలసి గోదాములు, దుకాణాల్లో తనిఖీ



శ్రీనివాస ఫర్టిలైజర్స్ గోదాములో తనిఖీ చేస్తున్న కలెక్టర్, ఎస్పీలు

నరసరావుపేట: రైతులకు ఎరువులు అధిక ధరలకు విక్రయించే డీలర్లు, వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు హెచ్చరించారు. శనివారం జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావుతో కలసి పట్టణంతోపాటు చుట్టుపక్కల ఉన్న షాపులు, గోదాములలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని మల్లమ్మసెంటర్‌లో గల శ్రీనివాస తిరుమల ఫర్టిలైజర్స్ గోడౌన్‌లో సోదాలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్, బిల్‌బుక్, ఇన్వాయిస్‌లు పరిశీలించారు. యూరియా నిల్వల్లో వ్యత్యాసం ఉండటంతో 108 బస్తాల అమ్మకాలను నిలిపివేశారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతుల అడ్రస్, ఫోన్ నంబర్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అధిక ధరలకు విక్రయించినా, ఇతర రాష్ట్రాలకు అమ్మకం చేసిన డీలర్‌పై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఆర్డీఓ కె.మధులత, తహసీల్దార్ కె.వేణుగోపాలరావు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కె.చంద్రశేఖర్, ఏఓ ఆదినారాయణ, మండల వ్యవసాయ శాఖ అధికారి ఐ.శాంతి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అమరావతిలో నిమజ్జన సందడి



అమరావతి: జిల్లా నలుమూలల నుంచి కృష్ణా నదిలో నిమజ్జనానికి వినాయక విగ్రహాలు తరలిరావటంతో శనివారం అమరావతిలో సందడి నెలకుంది. ఒడ్డున పోలీస్‌శాఖ, ధరణికోట గ్రామ పంచాయతీ సమన్వయంతో నిమజ్జనోత్సవాలు ఎటువంటి ఆటంకాలు లేకుండా జరిగేందుకు చర్యలు చేపట్టారు. పోలీసు శాఖ గుంటూరు రోడ్డు నుంచి రింగ్ రోడ్డు మీదుగా ఆరుడొంకల బావి సెంటర్, ధ్యానబుద్ధ విగ్రహం వరకు కూడళ్లలో ప్రత్యేకంగా పోలీసులను ముందస్తు జాగ్రత్తగా నియమించారు. సీఐ అచ్చియ్య ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

జీజీహెచ్‌కు శరీర దానం



ఆవుల శ్రీనివాసరావు (ఫైల్)

నాదెండ్ల: గొర్రెల మందపై కారు దూసుకెళ్లిన ఘటనలో కాపరితో పాటు రెండు గొర్రెలకు తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి తెలిసిందే. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన పల్నాడు జిల్లా గణపవరం గ్రామానికి చెందిన ఆవుల శ్రీనివాసరావు(45) గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇతని భార్య కరోనా సమయంలో మృతి చెందగా, కుమారుడు ఉన్నాడు. మృతుడి తండ్రి సాంబయ్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ప్రమాదానికి కారణమైన కారును స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతిచెందిన శ్రీనివాసరావు భౌతికకాయాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి దానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

భూ వివాదాలకు చెక్ పెట్టేందుకే 'నక్ష'



మంగళగిరి టౌన్: పట్టణాల్లో రెవెన్యూ రికార్డులను పక్కాగా అమలు చేయడానికి, భూ వివాదాలకు చెక్ పెట్టేందుకు నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబిటేషన్స్ (నక్ష) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంగళగిరి నగర అసిస్టెంట్ సిటీ ప్లానర్ అజయ్‌కుమార్ తెలిపారు. నక్ష పైలెట్ ప్రోగామ్‌లో భాగంగా మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ ఏరియల్ సర్వేకు ఎంపికైందని, ఇందులో భాగంగా భూ రీసర్వే చేస్తున్నట్లు పేర్కొన్నారు. భూములకు సరిహద్దులు నిర్ధారించడంతోపాటు నక్ష పటాన్ని రూపొందిస్తామని అన్నారు. భూముల డిజిటలైజేషన్ ద్వారా సమగ్ర సర్వే చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సౌజన్య ఎంపిక

బాపట్ల జిల్లా నుంచి ఎంపికైన ఏకైక ఉపాధ్యాయురాలు



బాపట్లటౌన్: బాపట్ల మండలం వెదుళ్లపల్లి పంచాయతీ వృక్షనగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యాతం సౌజన్య ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. రాష్ట్ర వ్యాప్తంగా 41 మంది ఎంపిక కాగా బాపట్ల జిల్లా నుంచి సౌజన్య ఒకరే ఎంపికయ్యారు. వీరికి సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో శనివారం విజయవాడలో వర్క్‌షాపు నిర్వహించారు. తోటి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సులభ రీతిలో విద్యాబోధన ఏవిధంగా చేయాలి, వినూత్న రీతిలో విద్యా బోధన చేస్తే ఉపయోగం ఏవిధంగా ఉంటుందనే విషయాలను క్షుణ్ణంగా వివరించారు. జిల్లా నుంచి ఎంపికైన యాతం సౌజన్యను జిల్లా సర్వశిక్ష అభియాన్ అడిషనల్ డైరెక్టర్ నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు. సౌజన్యను అభినందించిన వారిలో సమగ్ర శిక్ష లెక్చరర్ సతీష్‌రెడ్డి, పీఆర్వో కమిటీ సభ్యులు మధుసూదన్ రావు, దుర్గావరప్రసాద్, అస్మిత, ఇస్మాయిల్ ఉన్నారు.

'కరెన్సీ' గణపతి కళకళ



వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని గణనాథుడిని వివిధ రూపాల్లో మండపాలలో కొలువుదీర్చారు. ప్రత్యేక అలంకరణలు చేసి, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం పట్టణంలోని 13వ వార్డు, పత్తి ఫ్యాక్టరీ వీధిలో ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మీ గణపతి మండపంలో సుమారు రూ. 15 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో విఘ్నాధిపతిని విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– మాచర్ల రూరల్

లాటరీ ద్వారా బార్‌లు కేటాయింపు



లాటరీ ద్వారా కేటాయిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా ఎక్సైజ్ అధికారి మణికంఠ

నరసరావుపేట: జిల్లాలో మూడేళ్లపాటు బార్ అండ్ రెస్టారెంట్ల లైసెన్సుల జారీకి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీ ప్రకారం శనివారం కలెక్టరేట్‌లో ఓపెన్ కేటగిరి, రిజర్వుడ్ బార్లకు సంబంధించిన లాటరీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సమక్షంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు నిర్వహించారు. దరఖాస్తుదారుల సమక్షంలో 23 బార్లకు లాటరీ ద్వారా కేటాయించారు. జిల్లాలో ఓపెన్ కేటగిరీలో గల 49 బార్లకుగాను 18 చోట్ల 73 దరఖాస్తులు వచ్చాయి. ఆ బార్లను లాటరీ ద్వారా కేటాయించారు. గీత కార్మికులకు చెందిన ఐదు బార్లకుగాను 22 దరఖాస్తులు వచ్చాయి. లాటరీ ద్వారా షాపులు కేటాయించారు. నరసరావుపేట పురపాలక పరిధిలో ఓపెన్ కేటగిరీలో తొమ్మిది బార్లు, రిజర్వుడు ఒకటి, చిలకలూరిపేట మున్సిపాలిటీలో మూడు బార్లు, ఒక రిజర్వుడు, సత్తెనపల్లి మున్సిపాలిటీలో నాలుగు బార్లు, ఒక రిజర్వుడు, గురజాల నగర పంచాయతీలో ఓపెన్ కేటగిరీ ఒకటి, దాచేపల్లి నగర పంచాయతీలో ఓపెన్ కేటగిరీ, రిజర్వుడు బార్ చొప్పున ఒక్కొక్క బార్‌కు లాటరీ ద్వారా షాపులు కేటాయించారు. మిగిలిన బార్లకు ప్రభుత్వం త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తుందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ కె.మణికంఠ పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ కె.రవీంద్ర, స్టేషన్‌హౌస్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైరల్ జ్వరాల విజృంభణ

- ఆందోళన కలిగిస్తున్న డెంగీ కేసులు
- రోజురోజుకు పెరుగుతున్న జ్వర పీడితులు
- రోగులతో కిక్కిరిసిపోతున్న ప్రభుత్వ వైద్యశాల
- ముందస్తు నివారణలో అధికారులు విఫలం



ఏరియా వైద్యశాల ఓపీ విభాగంలో బారులు తీరిన రోగులు

నరసరావుపేట టౌన్: పల్నాడు జిల్లాలో వైరల్ జ్వరాల విజృంభణ ఆందోళన కలిగిస్తోంది. ప్రతి రోజు కొత్త కేసులతో వైద్యశాలలో చేరే వారి సంఖ్య పెరుగుతుంది. జ్వరం, వళ్లు నొప్పులు, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలతో రోగులు ఏరియా వైద్యశాలకు బారులు తీరుతున్నారు. నరసరావుపేట ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు ప్రతిరోజు సాధారణంగా 450 వరకు ఓపీ ఉంటుంది. ప్రస్తుతం 550 వరకు నమోదు అవుతుంది. సీజనల్ వ్యాధులతో బాధపడుతూ శనివారం ప్రభుత్వ వైద్యశాలకు వచ్చిన రోగులతో రద్దీ పెరిగింది. ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు సుమారు 550 మంది వస్తుంటే అందులో 100 మందికి పైగా జ్వరపీడితులే కావటం ఆందోళన కలిగిస్తోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వారు జ్వరం, జలుబు, దగ్గు, అతిసారంతో ఇబ్బంది పడుతూ వస్తున్నారు. కురుస్తున్న వర్షాల వల్ల దోమల ఉధృతి పెరిగింది. నీరు నిల్వ, మురుగు కాల్వల్లో పేరుకు పోయిన చెత్త, తడి వాతావరణం కారణంగా దోమలు వృద్ధి చెంది ప్రజలు వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు.


అధికమైన డెంగీ జ్వరాలు..

వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. నరసరావుపేట ఏరియా వైద్యశాలకు పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి అధిక సంఖ్యలో జ్వరాలతో బాధపడుతూ వస్తున్నారు. వారిలో డెంగీ లక్షణాలు ఉండటంతో పరీక్షలు నిర్వహించగా ఇప్పటి వరకు 20 కేసులు నమోదు అయ్యాయి. ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. దీర్ఘకాలిక జ్వరం, వాంతులు, విరేచనాలు, శరీరంపై దద్దుర్లు వంటి లక్షణాలు ఉంటే ఆలస్యం చేయకుండా సమీపంలోని వైద్యశాలను సంప్రదించాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

నివారణకు చర్యలేవి..

డెంగీ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు నివారణకు తగు చర్యలు తీసుకోకపోవటం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డెంగీ కేసులు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్, మందు పిచికారి, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి చర్యలు ఆరోగ్య శాఖ చేపట్టాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించాలి. అయితే దోమల నివారణకు ఆరోగ్య శాఖ ముందస్తు చర్యలు తీసుకోక పోవటంతోనే వైరల్ జ్వరాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

రాజధాని రైతుల భూ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు

గుంటూరు వెస్ట్: అమరావతి రాజధాని పరిధిలోని రైతులకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు తెలిపారు. శనివారం గుంటూరు కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహాతో కలిసి నిర్వహించిన సమావేశంలో కన్నబాబు మాట్లాడుతూ రైతులు అధికారుల దృష్టికి తీసుకొస్తున్న ఇబ్బందులను ఒక పోర్టల్‌లో ఉంచి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

క్లుప్తంగా

సుఖవ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రవి

నరసరావుపేట: విద్యార్థులు, ప్రజలు డ్రగ్స్, హెచ్ఐవీ, సుఖవ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. శనివారం కార్యాలయంలో సుఖవ్యాధులపై రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ముద్రించిన ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్ పుస్తకాలు ఆవిష్కరించారు. ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశానుసారం జిల్లా వైద్యఆరోగ్యశాఖలో భాగమైన డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవీ, ఎయిడ్స్ (దిశ) ఆధ్వర్యంలో జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలలో హెచ్ఐవీ, ఎయిడ్స్, డ్రగ్స్ సుఖవ్యాధులపై అవగాహన కోసం అక్టోబరు 12 వరకు ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్ నిర్వహించటం జరుగుతుందన్నారు. జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ మురళీకృష్ణ, జిల్లా క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ జానీబాష, పీపీ టీసీటి కౌన్సిలర్ జ్యోతి, వివిధ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

నదిలో మునిగి యువకుడు మృతి



అమరావతి: నదిలో స్నానానికని వెళ్లి మునిగి, ఊపిరాడక యువకుడు మరణించిన సంఘటన శనివారం మధ్యాహ్నం అమరావతి అమరేశ్వరస్వామి ఘాట్ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం మేరకు.. మండల పరిధిలోని నెమలికల్లు గ్రామానికి చెందిన షేక్ సుభాని(37) తన భార్య బాజీబీ టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతుండడంతో ఇద్దరు కలిసి చికిత్స కోసం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వచ్చారు. మధ్యాహ్న సమయంలో అమరేశ్వరఘాట్ సమీపంలో భార్య ఒడ్డుపై కూర్చొని ఉండగా సుభాని స్నానానికని నదిలోకి దిగాడు. ఒక్కసారిగా ప్రవాహం పెరగడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. సమాచారం తెలుసుకున్న సీఐ అచ్చియ్య, సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి గజఈత గాళ్ళతో గాలింపుచర్యలు చేపట్టారు. సంఘటన స్థలానికి దగ్గరలోనే సుభాని మృతదేహం లభ్యమైంది. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన జాతీయస్థాయి యోగా పోటీలు

- ఓవరాల్ ఛాంపియన్ విన్నర్లుగా భోపాల్ రీజియన్
- రన్నర్లుగా హైదరాబాద్ రీజియన్
- విజేతలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీలకు అర్హత



ఓవరాల్ ఛాంపియన్ విన్నర్స్ ట్రోఫీని అందుకుంటున్న భోపాల్ రీజియన్ విద్యార్థులు

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే ప్రతి అంశాన్ని ఛాలెంజ్‌గా తీసుకుని పట్టుదలతో కృషి చేయాలని మద్దిరాల జేఎన్‌వీ పూర్వ విద్యార్థి, తమిళనాడు రాష్ట్ర లేబర్ వెల్ఫేర్, స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్యదర్శి కె.వీరరాఘవరావు పేర్కొన్నారు. నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి యోగా క్రీడా ప్రదర్శన పోటీల ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిలకలూరిపేట మండలం మద్దిరాలలోని పీఎంశ్రీ జేఎన్‌వీలో హైదరాబాద్ జేఎన్‌వీ రీజియన్ పరిధిలో మూడు రోజులు యోగా ప్రదర్శన పోటీలు జరిగాయి.

గ్రూప్ ఆసనాలు, రిథమిక్, ఆర్టిస్టిక్ యోగా విభాగాల్లో అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో బాలురు, బాలికలకు వేర్వేరుగా ఉత్కంఠ భరితంగా జరిగిన ఈ పోటీలు శనివారంతో ముగిశాయి. విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు అధ్యక్షత వహించగా, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పరిచయ, మూడు రోజుల యోగా పోటీల నిర్వహణ సారాన్ని వివరించారు. మరో అతిథి హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ కమిషనర్ డి.చక్రపాణి మాట్లాడుతూ జేఎన్‌వీల్లో చదివిన ఎందరో ఉన్నతస్థానాల్లో ఉంటూ అందరికీ రోల్‌మోడల్‌గా నిలుస్తున్నారని చెప్పారు.

విజేతలు వీరే..

ఓవరాల్ ఛాంపియన్ షిప్ టైటిల్‌ను నవోదయ భోపాల్ రీజియన్ సాధించగా, ఛాంపియన్‌షిప్ రన్నర్స్‌గా హైదరాబాద్ రీజియన్ నిలిచింది. యోగాసనాల్లోని అన్ని రీజియన్లలో బాలికల విభాగంలో బెస్ట్‌యోగిని అవార్డును సుస్మితాదాస్ (భోపాల్), బాలుర విభాగంలో బెస్ట్‌యోగి అవార్డును సోహమ్ సుమన్(జైపూర్)కు దక్కాయి.

అతిథులు, విజేతలు, సేవకులకు సత్కారం...



బెస్ట్ యోగిని అవార్డు అందుకుంటున్న సుస్మితాదాస్ (భోపాల్)



బెస్ట్ యోగి అవార్డు అందుకుంటున్న సోహమ్ సుమన్ (జైపూర్)

ముగింపు సమావేశంలో, జాతీయస్థాయి యోగా పోటీల విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే, ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన 15 మందిని జేఎన్‌వీ ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఎన్‌వీఎస్ హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ కమిషనర్ డి.చక్రపాణి, విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ సి.ప్రభాకరరెడ్డి, పూర్వవిద్యార్థి డాక్టర్ ఎం.రాజశేఖర్, విశ్రాంత ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, సాంబయ్య, పీఈటీలు ఆర్.పాండురంగారావు, జి.గోవిందమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సెస్సు చెల్లించాలి

ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ



నరసరావుపేట ఈస్ట్: మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు వెంటనే గ్రంథాలయ సెస్సు చెల్లించి గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ తెలిపారు. పల్నాడు రోడ్డులోని శాఖా గ్రంథాలయాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా సందర్శించి, రికార్డులు పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, గ్రంథాలయ సెస్సును వెంటనే చెల్లించాలని కోరారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగులు, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచేందుకు రీడర్స్ ఆన్ డిమాండ్ విధానంలో వెంటనే కొనుగోలు చేసి అందుబాటు ఉంచుతున్నట్లు వివరించారు. గ్రంథాలయానికి వచ్చే విద్యార్థులు, పాఠకుల సంఖ్య రోజు రోజుకు పడిపోవటంపై ఆందోళన వ్యక్తం చేశారు. గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి సభ్యత్వం తీసుకొని తమకు ఉపయోగపడే విజ్ఞాన, వినోద, సబ్జెక్ట్ పుస్తకాలను తీసుకొని కొంత సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలని తెలిపారు. గ్రంథాలయాధికారి యడ్లపాటి రాధ, సిబ్బంది పి.కోటేశ్వరి, వై.సునీల పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడిన యువకుడు

తీవ్రగాయాలు.. 108 వాహనంలో సత్తెనపల్లి ఆస్పత్రికి తరలింపు



పెదకూరపాడు: మాచర్ల - రేపల్లె ప్యాసింజర్ రైలు నుంచి జారిపడి యువకుడికి గాయాలైన సంఘటన పెదకూరపాడు రైల్వే స్టేషన్ వద్ద శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదకూరపాడు నియోజకవర్గ అచ్చంపేట మండలం తాళ్లచెరువు గ్రామానికి చెందిన 25 సంవత్సరాల దాసరి దిలీప్ సత్తెనపల్లి రైల్వే స్టేషన్‌లో మాచర్ల - రేపల్లె ప్యాసింజర్ రైలు ఎక్కాడు. మార్గమధ్యలో పెదకూరపాడు రైల్వే స్టేషన్ సమీపంలో దిలీప్‌కు ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో డోర్ వద్ద కూర్చున్న అతను రైలు నుంచి జారిపడ్డాడు. విషయం తెలుసుకున్న తోటి ప్రయాణికులు పెదకూరపాడు రైల్వేస్టేషన్‌లో సమాచారం ఇవ్వగా 108 సహాయంతో సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. దిలీప్ తల భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు వద్ద వివరాలు తీసుకొని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. తండ్రి బాబు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడని ఇంట్లో తెలియకుండా గుంటూరు వైద్యశాలకు వెళ్లే క్రమంలో ఘటన జరిగిందని తెలిపారు.

ఆర్థిక చేయూతపై త్వరలో సమావేశం

ఏర్పాట్లు చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు



అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: జిల్లాలోని బ్యాంకు అధికారులతో ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా పథకం, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన, ఇతర ప్రభుత్వ పథకాలకు ఆర్థిక చేయూతపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. శనివారం కార్యాలయంలో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ కమిటీ చైర్మన్ హోదాలో పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ సమన్వయ కర్త, జిల్లా పరిశ్రమల అధికారి జి.కృష్ణారావు తొమ్మిది అంశాల అజెండాను వివరించారు. సింగల్ డెస్క్ దరఖాస్తులు, ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం, ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన, పరిశ్రమల రాయితీలు, కొండవీడు గ్రామం, యడ్లపాడు మండలంలో ఆర్ష ధాతు నానో టెక్నాలజీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కు వారిచే వచ్చిన ప్రతిపాదనపై ప్రస్తుత పరిస్థితిని కలెక్టర్‌కు వివరించారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎంఎల్.నరసింహారావు చిలకలూరిపేట, గురజాల మండలాలలో ఎంఎస్ఎంఇ పార్కుల స్థాపనకోసం భూమి సమీకరణకు అభ్యర్థించారు. ఈ అభ్యర్థనపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. వచ్చే అన్నీ అజెండా అంశాలను సమర్థవంతంగా అమలుచేయాలని దిశానిర్దేశం చేశారు. ప్లానింగ్ ఆఫీసర్, పల్నాడు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ప్లానింగ్ ఆఫీసర్ జి.సుబ్బారెడ్డి, కమర్షియల్ టాక్సెస్ ఆఫీసర్ కె.రామలింగయ్య, ఏపీ ఎస్ఎఫ్‌సీ బ్రాంచ్ మేనేజర్ పి.వెంకయ్య, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పి.రాజు, అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ కె.సుమంత్ , జిల్లా పంచాయతీ అధికారి ఎస్‌వీ నాగేశ్వరరావు నాయక్, జిల్లా రవాణాశాఖ అధికారి జి.సంజీవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా సాఫ్ట్‌బాల్ పోటీలు



విజయనగరం, ఈస్ట్ గోదావరి జట్లతో నిర్వాహకులు

- రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి హాజరైన మహిళల జట్లు
- సెమీ ఫైనల్‌కు వైఎస్సార్ కడప, కృష్ణా, గుంటూరు, విజయనగరం జట్లు

సత్తెనపల్లి: సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల సమీపంలోని లయోలా ఇంజినీరింగ్ కళాశాలలో 12వ అంతరాష్ట్ర స్థాయి మహిళల సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పోటీలు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 12 సీనియర్ సాఫ్ట్‌బాల్ మహిళల జట్లు హాజరయ్యాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహించారు. మహిళల సాఫ్ట్‌బాల్ పోటీల్లో పోటీపడిన జట్లలో గెలుపొందిన జట్లు వరుసగా ... శ్రీకాకుళం-ప్రకాశం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 10-0తో శ్రీకాకుళం, కర్నూలు-కృష్ణ 1-2తో కృష్ణా, గుంటూరు-ఈస్ట్ గోదావరి 10-0 తో గుంటూరు, అనంతపురం - వైఎస్సార్ కడప 3-4తో వైఎస్సార్ కడప, విజయనగరం-శ్రీకాకుళం 9-3తో విజయనగరం, కర్నూలు-చిత్తూరు 9-8తో కర్నూలు, గుంటూరు-విశాఖపట్నం 10-0తో గుంటూరు, అనంతపురం-నెల్లూరు 11-1 తో అనంతపురం, విజయనగరం-ప్రకాశం 10-0తో విజయనగరం, కృష్ణ-చిత్తూరు 8-1తో కృష్ణా, ఈస్ట్ గోదావరి-విశాఖపట్నం 3-2తో ఈస్ట్ గోదావరి, వైఎస్సార్ కడప - నెల్లూరు 5-2 జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వైఎస్సార్ కడప జట్టు గెలుపొందాయి.

క్వార్టర్ ఫైనల్ పోటీల్లో ...

వైఎస్సార్ కడప - కర్నూలు మధ్య జరిగిన మ్యాచ్‌లో 10-0తో వైఎస్సార్ కడప, కృష్ణ-అనంతపురం 3-2తో కృష్ణా, గుంటూరు - శ్రీకాకుళం 6-2తో గుంటూరు, విజయనగరం - ఈస్ట్ గోదావరి 10-0తో విజయనగరం గెలుపొందాయి. వైఎస్సార్ కడప, కృష్ణా, గుంటూరు, విజయ నగరం జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. ఆదివారం సెమీ ఫైనల్స్‌లో మొదటిగా వైఎస్సార్ కడప - గుంటూరు, రెండవదిగా కృష్ణ - విజయనగరం జట్లు పోటీపడనున్నాయి.

■ ప్రారంభ కార్యక్రమంలో డీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువురి నాగేశ్వరరావు, రిటైర్డ్ పీడీ దాసరి కోటేశ్వరరావు, లయోలా ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి, చైర్మన్ రాజారెడ్డి, సెక్రటరీ సామంతరెడ్డి, ట్రెజరర్ జనార్దన్ యాదవ్, ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పుణ్యాల నరసింహారెడ్డి, కన్వీనర్ ఎంవీ రమణ, క్రీడాకారిణిలు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

ఎనిమిది మండలాల్లో స్వల్ప వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు ఎనిమిది మండలాల్లో స్వల్ప వర్షం పడింది. ప్రత్తిపాడు మండలంలో 6.4 మిల్లీ మీటర్లు, ఫిరంగిపురం 3.2, తాడేపల్లి 3.2, దుగ్గిరాల 2.8, మంగళగిరి 2, తాడికొండ 2, పొన్నూరు 0.6, మేడికొండూరు మండలంలో 0.4 మి.మీ. చొప్పున వర్షపాతం పడింది.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.